

# వేప్రిన్

దెబ్బలు, కురుపులు, తామర, ఎక్జిమా, గజ్జి, సుఖవ్యాధుల వలన కలిగిన పుండ్లు, తేలుకుట్టు, మూలశంఖ, కాల్పులు మొదలైనవాటిని అద్భుతంగా నివారణ చేస్తుంది. కొత్తచర్మం త్వరగా వచ్చేటందుకు సహాయపడుతుంది. ప్రతియింటా తప్పనిసరిగా డాక్టరులా వుండితీరాల్సిన ఔషధం.

$\frac{1}{4}$ ఔ సీసా అణాలు 8. $\frac{1}{2}$ ఔ సీసా అణాలు 14.



# హాలేరిన

అతిసారానికి, జిగట, రక్త విరోచనాలకి అద్భుతమైన ఔషధం.

అతిసారం, జిగట, రక్త విరోచనాలు, వాంతులు, జబ్బువల్లవచ్చిన జ్వరం వీటిని తగ్గించును. అసాధ్యమైన జబ్బులన్నీ ఈ మందుకి సాధ్యమౌతాయి.

6 మాత్రలు గల పేకెట్ 4 అణాలు.



# క్యాప్సినాల్

దగ్గు, రొంపల్ని అశ్రద్ధగా చూడకండి.

ఎందుకంటే ఊపిరితిత్తులలో రకరకాల వ్యాధుల్ని తీసుకొస్తుంది. అలా రాకుండా 'క్యాప్సినాల్' సహాయపడుతుంది.

దగ్గులు, రొంపలు, ఇన్ఫ్లుయెంజా, మొదలైన వ్యాధుల్ని నివారణచేస్తుంది.

6 మాత్రలు గల పేకెట్టు 4 అణాలు.

4 ప్యాకట్లకు తక్కువ వి. పి. లో పంపబడదు.

అన్ని షాపులలోనూ దొరకును.

ది లస్టర్ మ్యాన్యుఫాక్చరింగ్ కంపెని,
చిక్‌పేట, బెంగుళూరు సిటీ.


# కటిక లోకం

శ్రీ ఎం. కృష్ణమూర్తి పట్నాయకుం

అర్ధరాత్రి—

మంచు వర్షధారాపాతం, కరడుగట్టించేచలి, కటిక చీకటి.

ఓ ఎండిన వృక్షం క్రింద ఓ అనాధ.

పైన కప్పులేదు. క్రింద చోటులేదు. కప్పబట్టలేదు. తినతిండిలేదు.

ఆకలి జ్వాల, అంటురోగజ్వాల దుఃఖజ్వాల, ప్రళయాగ్నుల్ని సైతం మించిపోతూన్నవి.

అస్థిపంజరమే ఆమె. ఎండిన మోడే ఆమె జీవచ్ఛవమే ఆమె.

చంకను చిన్న శిశువు—కాదు—కొద్ది జీవంతోనున్న కొయ్యబొమ్మ! పాలు కని స్తనాల్ని చప్పరిస్తోంది. కానీ పాలు వస్తోందో లేక మరేమొస్తోందో!

గజగజ వణకుతూ బాధతో రొప్పుకుంటోందామె.

ఆ బాధలో—పూర్వ సంఘటలన్నీ స్మృతికివచ్చి ఆమెను మరీ చైతన్యశూన్యురాలినిగాచేసి దొర్లిపోతూన్నవి.

*　　*　　*

ఎండమండిపోతూన్నది. పైగా మిట్టమధ్యాహ్నం.

నాలుగు రోజులనుండి పస్తు. అన్నం మెతుకన్నది దృశ్యమవలేదు. పిల్లాడికి

ఈ కరువులో యెంతమంది గంగపాలైనారో చెప్పలేము. యుద్ధపిశాచి పోయినా కరువుపిశాచి వదలలేదు. నానాటికీ ఇంకనూ అధికమవుతోన్నది కరువు. ఈ పిశాచివల్ల తన దుర్భర జీవితాన్ని గంగార్పణం చేసివైచిన ఒక అనాధయువతి గాథ యిందులో చిత్రించడమైనది.

పాలు లేదు. తన ఆస్థిపంజరాకారంలో ఏం పాలు లభ్యమౌతుంది? ఎంతకని లభ్యమౌతుంది?

అమ్మా!...తల్లీ!...ఇంత గెంజి...

......

చితికిన గొంతుకతో అరచి అరిగిన కాళ్లతో తిరిగి వేసారిపోయింది. కానీ ఫలితం శూన్యం.

ఆశా జ్యోతి ఆరిపోయింది. ఆకలి జ్వాల విజృంభించింది. పిల్ల స్మృతి తప్పిపోయింది. భారత భూమిలో గంజీ కరువా?......

ఆహా!

ఏమిటి దారి?

* * *

తిరగలేక ఓచోట ఒరిగిపోయింది. ఆ తోవవేపే పోతున్నారుఅందరు.

కాని ఎవరిగొడవ వారిదే. ఎవరికి వారే యమునాతీరే! పలకరించే వ్యక్తే లేదు.


సంవత్సరాలతరబడి పరిశోధన

•

వీటిని సృష్టించగలిగినది

# జాబ్‌కో

ఫౌంటింక్ • లైమ్‌గ్లిస్
బ్రిలియన్‌షైన్ • హేర్‌గ్రోయర్
• సువాసన కాస్టరాయిల్ •
చందన సోపు • స్నో
• లిక్విడ్ బ్రిలియన్‌షైన్ •
పెర్ఫ్యూమ్డ్ కోకనట్ ఆయిల్

ప్రతి అంగడిలోనూ దొరకును

జయభారతం కంపెనీ,
మల్లేశ్వరం :: బెంగుళూరు

కాస్సేపటికి తెలివిరాగా కూర్చుంది. పగిలిన హృదయంతో మళ్లా—నాయనా! తండ్రీ....తల్లీ!... కనికరించండి...ఆర్త నాదం చేసింది.

ఆ తోవనే పోతున్నాడో సాహుకారు తన్నుచూచి అన్నాడు—''ఎందుకీగతి? ఐదు రూపాయలిస్తాఒక్క!...''అర్థోక్తిలోనే ఆగి కళ్లు తిప్పాడు.

తను ముఖం అవలకు తిప్పి చెవులు మూసుకుంది. 'ఎంత పతివ్రత!' వెక్కిరిస్తూ పోయాడో పెద్ద సాహుకారి.

ఏమీ అందం. బంగారు దేహం. గుండ్రని మొఖం. ఇలా బాధతో యౌవనాన్ని ఎందుకు వృధాచేయడం. ఒక్క...కొన్ని రూకలు జమచేయగలవు. ఏం?...అన్నాడో భావకవి ఆదారిని వెళ్తూ.

ములుకులవలె గుచ్చుకున్నాయి ఆ మాటలు తలవంచుకుని కన్నీరు కార్చింది.

ప్రణయదేవీ ఇంత నిర్దయత్వంబు తగునా?...పేలుతూ పోయాడా కవిసార్వభౌముడు.

కులట ఎవరితో లేచివచ్చావో వారి నడగరాదు? కళ్ళెఱ్ఱజేసి అన్నాడో చాంధసబ్రహ్మ.

రాయేనారెంట చక్కని...! ఎంకి పాట వినిపించాడో రసిక ఎంకి మగడు.

ఆహా ప్రపంచం! తనుకులటా? పాపా! ఆడది కనబడితే ఎందుకా వృత్తపాతం?

* * *

స్వార్థం విడిచి పదిమందికి సహాయం చేసి ఉన్నత స్థితిలోనున్న అత్త మామలు వంకర దినాల ప్రభావంచే నలుని బాధలకు లోనై పరలోకానికి పోయారు.

ఏకైక పుత్రికయని హృదయం మీద పెంచి అష్టైశ్వర్యాలతో తులతూగిన తల్లి దండ్రులు మట్టి పాలయారు.

తన జీవిత రాజ్యానికి రాణిగాజేసి సుఖ సౌధంలో విహరింపజేసిన జీవిత నాథుడు అకాల మరణానికి లోనయ్యాడు.

బెల్లంలేక పోతే చీమలురానట్టు చుట్టాలందరూ ఎక్కడో దాక్కున్నారు. ఒక్క ఏడాదిలో ఎంతటి విషాద సంఘటనలు! కరువు కరాళ పిశాచియొక్క ఎంతటి ఘోర కృత్యాలు!

ఏందారి? తనకు విద్యలేదు. ఏపనీచేత రాదు. ఒంటిగా బ్రతుకగలననే ధైర్యం లేదు, భారత రమణిఖర్మమేమో ఇది!

ఈ కరువు పిశాచి ఇంకెంత కాలం నగ్ననృత్య మాడుతుందో!

* * *

అర్థరాత్రి—

మంచు వర్షధారాపాతం. కరుడుగట్టించే చలి. కటిక చీకటి.

గంగానది ఒడ్డుకు ఎవరో పోతున్నారు. అంతా అతి నిశ్శబ్దం. చీమనడకను గూడా తెలియపర్చే సమయం.

గంగమ్మ తల్లి ప్రశాంతంగ ప్రవహిస్తోంది. "గంగమ్మ తల్లీ నీకు జేజేలు!" నయవినయభయాలతో నిండిన ఒకే కేక.

ఆ వెంటనే చరచరా గంగ గర్భంలోనికి నడచిపోయిన వ్యక్తి అడుగుల చప్పుడు ఓసెకను ఆ సాంద్ర నిశ్శబ్దాన్ని భంగ పరిచినై. అంతే!

క్షణభంగురమైన ఆనిశ్శబ్దం మళ్లా అతినిశ్శబ్దమైపోయింది.

మరునాడు——

గంగ ఒడ్డు

నిర్మానుష్యమైన ప్రదేశం

* * *

ఓ శవం కెరటాలచే కొట్టుకుంటూ ఒడ్డునుచేరింది, వెంటనే కొన్ని రాబందులు అక్కడ తయార్! ముక్కులతో పొడిచి మాంస భక్షణకు మొదలిడినై. కానీ లాభం లేకపోవడంచేత తక్షణం వీడిపోయినై. ఆశవాన్ని.


శ్రీ జెయలక్ష్మి ట్రేడింగ్ కంపెని.,

ఆంధ్రా చేనేతబట్టలు టోకు వ్యాపారం

**263, రామనాధపురం రోడ్డు, మధుర.**

మన కొట్టులో 30 × 60, 27 × 54, టాకరు టవలుమడతలు, కన్నకీ ప్రభాత్ టవలుమడతలు, 80 × 80 లో జరిఅంచు ఫ్యాన్సిచీరలు, 80 × 80 లో పూసి, చీరలు, 40s లో మేనకా చీరలు, 80s లో స్పెషల్ రకంనక్కితానులు, 80s లో వాయిల్ గడి & ప్లేన్ షర్టింగ్ తానులు, వెండిజరిలో తయారయిన కలరుకోడి ప్లేటు కండవాలు, పంచలు, తెల్లపేటులో కండవాలు, పంచలు రకాలు, అసలు ఖద్దరు కండవాలు, పంచలు సరసమయిన ధరలకు దొరకును.

**S. J. T. Coy. Madura.**



TRADE MARK

**Sri Jayalakshmi Trading Co.**

Wholesale Andhra Handloom Cloth.
Merchants & Manufacturers

263, Ramnad Road, MADURA.

*Specialists in:*—**Takkar Towels, Check Towels, 80s Fancy Sarees, Jari Duppatas, Dhoties, Nakki Pieces, Voil Shirtings, Menaka Sarees and Pure Khaddar Dhoty & Duppatas. etc.**